క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

రాజాం: స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణలో మంగళవారం స్వాతంత్య్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నేతలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



సంతకవిటి: కేసరినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగులు, జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు.

సంతకవిటి: మండలంలోని సోమన్నపేట గ్రామంలో ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన వారి(బాధిత) కుటుంబాలను ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు పరామర్శించారు. సోమవారం ఆ గ్రామానికి చేరుకుని మృతులు గంద్రేటి చంద్రశేఖర్, పాండ్రంకి కేసరినాయుడు, దూబ రెయ్యమ్మల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపి, ఓదార్చారు. అనంతరం ప్రమాద స్థలిని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పి.సత్యంనాయుడు, పి.వెంకటనాయుడు, పి.త్రినాథ్, పి.గణపతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు

వంగర: మండలంలోని సంగాంలో వెలసిన సంగమేశ్వరస్వామికి భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. అక్కడ మూడు నదులు కలిసే ప్రదేశమైన త్రివేణి సంగమం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయ గర్భగుడిలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలని వేడుకున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

బొండపల్లి(మెంటాడ): మెంటాడ మండలంలోని కుంటినవలసలో శ్రీసిద్ధివినాయక దత్తాత్రేయ షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త షేక్ హుస్సేన్, పూజారి కాశీకాళీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఆవుమూత్రం, పొగాకు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, కరివేపాకుతో తయారు చేసే అగ్నిఅస్త్రాన్ని పంటపై పిచికారీ చేస్తే పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లు రాకుండా ఉంటాయని ఏఓ జి.మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఎంపీటీసీ పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీరసాగరం గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధితో పాటు ప్రజలంతా బాగుండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరోవైపు ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ వర్గానికి మేలు జరిగేలా పథకాలను అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో అవినీతి లేని పాలన, సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, ఎంపీటీసీ సభ్యుడు గొర్లె దాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'



తెర్లాం: అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ



రాజాం సిటీ: సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులు

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ రమామణి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరైన ఆమె జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల లాగిన్ ప్రతిరోజూ ఓపెన్ చేసి, అందులో నమోదై ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. మీ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు కాకపోతే వాటిని సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అక్కారావు, ఈవోపీఆర్డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారం..

తెర్లాం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రజల అర్జీలలోని ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే ఆ సమస్య పరిష్కారం కాకపోవడానికి గల కారణాన్ని ఫిర్యాదుదారునికి తెలియజేయాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దన్నారు.

రాజాం సిటీ: స్పందన కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సోమవారం సమావేశమై, ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంపీ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని నమ్మితే భవిష్యత్ అంధకారం



బొద్దాంలో ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: టీడీపీని నమ్మితే రాష్ట్ర భవిష్యత్ అంధకారమవుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొద్దాం గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సంక్షేమ పథకాల రూపంలో అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ గుర్తింపు పొందిందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తోందన్నారు. గతంలోని ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని పథకాలు జగనన్న ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు అమలు చేసిందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గతంలో టీడీపీ జన్మభూమి కమిటీలతో రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలు ప్రజల వద్దకు వచ్చి, గతంలో తాము ఏం చేశారో చెప్పకుండా రాష్ట్ర పురోగతి, ప్రజాసంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్న జగనన్న సర్కారుపై లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. వారి మాటలు నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ రాజాం మండల కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, సర్పంచ్ ఎస్.తవిటమ్మ, వైస్ ఎంపీపీ ఎస్.వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



రామభద్రపురం: జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజు వితరణ చేసిన జాతీయ జెండాలను ఎంపీపీ చేతులమీదుగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తిని చాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని ఏపీఎం పి.మంగమ్మ మహిళలకు సూచించారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని, మండలంలోని ఉప్పరనాయుడువలస, చాటాయవలస తదితర గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశమైన ఆమె హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమం కొనసాగుతోందని, మంగళవారం కూడా ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, అంగన్‌వాడీ కార్యకర్త పి.భాను తదితరులు పాల్గొన్నారు.

నా భూమి నా దేశమనే భావన కలిగి ఉండాలి

బొబ్బిలి: నా భూమి నాదేశం అనే భావన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని పక్కి గ్రామంలో సోమవారం నిర్వహించిన నా భూమి నా దేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాసేపు మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున స్వాతంత్య్ర సముపార్జనకు కృషి చేసిన మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకుని, భావితరాల్లో స్ఫూర్తిని నింపాలన్నారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆ తర్వాత మాజీ సైనికులను సత్కరించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.పైడిరాజు, ఎంపీడీఓ పి.రవికుమార్, ఏపీఓ రాజు, సెక్రటరీ పక్కి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి..

సంతకవిటి: నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండగూడేం గ్రామ సచివాలయం వద్ద ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యత, పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అంతకుముందు కార్యక్రమ శిలాఫలకం ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్. జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ కె.వెంకటప్పలనాయుడు, ఎంపీటీసీ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



























